



# ఆదిలాబాద్-మంచిర్యాల



తెలుగు దినపత్రిక

# సూర్య

♦ నిర్మల్ ♦ కొమురంభీం ఆసిఫాబాద్

బుధవారం, 13 డిసెంబర్ 2023 — 6 పేజీలు


# నిస్పక్షపాత పద్దతిన పంటకోత ప్రయోగం

## - జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్





**అదిలాబాదు, బ్యూరో, డిసెంబర్ 12, సూర్య మేజర్ న్యూస్ :**

వానాకాలంలో సాగైన పంటల ద్వారా దిగుబడులను అంచనా వేయడానికి ప్రణాళిక శాఖ, వ్యవసాయ శాఖ సంయుక్త ఆద్వర్యంలో జిల్లాలో నిస్పక్షపాత పద్ధతిన పంట కోత ప్రయోగం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం జిల్లాలోని దండేపల్లి మండలం రోళ్ళపహాడ్ గ్రామంలో నిర్వహిస్తున్న వానాకాలం 2023 నుండి 2024 పంట కోత ప్రయోగాన్ని జిల్లా వ్యవసాయ అధికారి జి. కల్పన, ముఖ్య ప్రణాళిక అధికారి జి.సత్యంలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంట కోత ప్రయోగములను ఆధారంగా చేసుకొని పంట దిగుబడి వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందించడం జరుగుతుందని, ఈ క్రమంలో ఎంపిక చేసిన గ్రామంలో సర్వే నంబర్, పంట పొలాలలో నిర్ణీత కొలతలలో పంట దిగుబడులను పారదర్శకంగా లెక్కించి దాని ద్వారా మండలం, జిల్లాలోని పంటల యొక్క దిగుబడులను అంచనా వేయడం, ప్రాథమిక కార్యకర్త (మండల ప్రణాళిక, గణాంక అధికారి) ద్వారా ప్రయోగం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి తహశిల్దార్, ఉప గణాంక అధికారి బి. రాజేందర్, ప్రణాళిక శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మహాలక్ష్మి పథకం ద్వారా

# మహిళలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణ ఏర్పాట్లు చేయాలి

## -జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్


**నిర్మల్ ప్రతినిధి,డిసెంబర్12,సూర్య మేజర్ న్యూస్ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణం కొనసాగించేందుకు ఆర్టీసీ అధికారులు,సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం, నిర్మల్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులో ప్రయాణిస్తున్న మహిళల ప్రయాణ సౌకర్యాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.మహిళా ప్రయాణికులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రయాణం కొనసాగించుటకు వారికి సహకరించాలని డిఎం ప్రతిమ రెడ్డిని సూచించారు.. తరువాయి2లో



**ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులో ప్రయాణిస్తున్న మహిళల ప్రయాణ సౌకర్యాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్**

# ప్రయాణంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలి



## - జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**బోథ్ ,సూర్య మేజర్ న్యూస్,**

మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రయాణ ఏర్పాట్లు చేయాలనీ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఆదిలాబాద్,బోథ్ ఆర్టీసీ బస్టాండ్ లను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు.ఆర్టీసీ అధికారులు అందిస్తున్న సేవలు, ప్రయాణ సౌకర్యాలను బస్ లలో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మహిళా ప్రయాణికులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రయాణం కొనసాగించేలా వారికి సహకరించాలని కండక్టర్లకు ఆయన సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల మహిళలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థినిలకు మండల, జిల్లా కేంద్రాలకు బస్ లలో ఉచిత ప్రయాణం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 81 వేల మంది మహిళా ప్రయాణికులు ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. మహిళలందరూ మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రవీణ్, డిపో మేనేజర్ కల్పన, అధికారులు విశ్వనాథ్, శ్రీకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వరి పంట మద్దతు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## -జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు

**ఆసిఫాబాద్, 12 డిసెంబర్ సూర్య మేజర్ న్యూస్**

వరి పంట మద్దతు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం జిల్లాలోని కలెక్టరేట్ భవనంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ వేణు, జిల్లా పౌరసరఫరాల అధికారి తారామణి, ముఖ్య ప్రణాళిక అధికా రవీందర్‌తో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. గోనె సంచులను రైతు కల్లాలకు, అనుమతి లేని ప్రదేశాలకు ఇవ్వకూడదని, ధాన్యం తేమ శాతం 17 కంటే తక్కువ ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన సమయంలో తప్పనిసరిగా రశీదును సంబంధిత రైతులకు అందజేయాలని, వ్యవసాయ శాఖ, వ్యవసాయ విస్తరణ శాఖ ధృవపత్రం లేకుండా ధాన్యం కొనుగోలు చేయకూడదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రేడ్ 'ఎ" రకానికి 2 వేల 203 రూపాయలు, సాధారణ రకానికి 2 వేల 183 రూపాయలు చెల్లించడం జరుగుతుందని, రైతులు మద్దతు ధర పొందాలంటే కేంద్ర ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ధాన్యాన్ని ఆరబెట్టి, చెత్త-తాలు, మట్టిపెడ్డలు, రాళ్ళు లేకుండా శుభ్రపరిచి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. తేమ గరిష్టంగా 17 శాతం, చెత్త-తాలు 1 శాతం, మట్టి పెడ్డలు-రాళ్ళు 1 శాతం, చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం 5 శాతం, పూర్తిగా తయారు కాని, ముడుచుపోయిన ధాన్యం 3 శాతం, తక్కువ రకముల మిశ్రమం 6 శాతం, చెడిపోయిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం 4 శాతానికి మించి ఉండరాదని తెలిపారు. రైతులు తమ ఫోన్ నంబర్‌ను ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతాతో అనుసంధానం చేసుకొని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, మొబైల్ నంబర్ అనుసంధానం కొరకు బ్యాంకులు, ఆధార్ కేంద్రాలు, పోస్టాఫీసులు, మీ-సేవా కేంద్రాలలో



గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సంప్రదించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించే సమయంలో ఓ.టి.పి. నంబర్ కోసం రైతులు తమ మొబైల్ ఫోన్‌ను తమ వద్ద ఖచ్చితంగా ఉండేలా చూసుకోవాలని, ఓ.టి.పి. నంబర్ వచ్చిన తరువాతనే ధాన్యం కొనుగోలు జరుగుతుందని తెలిపారు. రైతులు తమ ఆధార్‌కార్డు, జిల్లా కలెక్టర్‌చే నియమించబడిన అధికారి ధృవీకరణ పత్రం, పట్టాదార్ పాస్ పుస్తకం, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్ ప్రతి, బ్యాంక్ ఖాతా పని చేస్తున్నట్లుగా బ్యాంక్ అధికారుల నుండి ధృవీకరణ తీసుకొని కొనుగోలు కేంద్రాలకు రావాలని తెలిపారు. కనీస మద్దతు ధర, ఇతర ఫిర్యాదుల కొరకు టోల్ ఫ్రీ నంబర్ 1967, 1800 425 0033లలో సంప్రదించవచ్చని తెలిపారు. వ్యవసాయ, పౌర సరఫరాలు, రవాణా, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పని చేయాలని, కొనుగోలు సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్రాగునీరు, టెంట్స్ కూర్చోవడానికి కుర్చీలు, మూత్రశాలలు, విద్యుత్ ఇతరత్రా పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాలని, కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మిల్లర్ దగ్గర నుండి రశీదు తీసుకొని 48 గంటలలోగా రైతులకు నగదు జమ చేసే విధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు, వెయింగ్ మిషన్లు, మాయిశ్చర్ మీటర్లు, ధాన్యాన్ని శుభ్రపరిచే క్లీనర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మహాలక్ష్మి పథకం ద్వారా

# మహిళలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణ ఏర్పాట్లు చేయాలి

## -జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్

మొదటి పేజీ తరువాయి...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణం కొనసాగించేందుకు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం, నిర్మల్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ లో బస్సులో ప్రయాణిస్తున్న మహిళల ప్రయాణ సౌకర్యాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మహిళా ప్రయాణికులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రయాణం కొనసాగించుటకు వారికి సహకరించాలని డిఎం ప్రతిమ రెడ్డిని సూచించారు,అనంతరం మున్సిపల్ పరిధిలోని ధర్మసాగర్, వైకుంఠ ధామం, కూడా సిర్గాపూర్ లోని నర్సరీ, ఫిల్టర్ బెడ్, బంగల్ పేట్ లో పారిశుద్ధ్య వనరుల ఉద్యానవనం పరిశీలించారు. ధర్మసాగర్ చెరువు దగ్గర నిర్మించే సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ స్థలాన్ని, బైల్ బజార్ దగ్గర నిర్మిస్తున్న స్మశాన వాటిక పనులను పరిశీలించి త్వరగతిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సిద్దాపూర్ లో నిర్వహిస్తున్న నర్సరీ, వాటర్ హెడ్ వర్క్ లను పరిశీలించారు. తదనంతరం ఎఫ్ఎస్‌టిపి, మునిసిపల్ డంపింగ్ యార్డ్ ను పరిశీలించి డంపింగ్ యార్డ్ నందు త్వరగతిన బయో మైనింగ్ పనులను చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో మునిసిపల్ కమీషనర్ సి.వి.యన్.రాజు,డి.ఈ. సంతోష్, ఏ. ఈ. లు వినయ్, హరిభువన్, టి. పి.ఓ. సుమలత, శానిటరీ ఇన్స్పెక్టర్ దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కులకై పోరాడే ఏఐటీయుసిని గెలిపించండి..ఏఐటీయుసి నాయకులు

**మందమర్రి టౌన్, డిసెంబర్ 12, సూర్య మేజర్ న్యూస్.**

రానున్న సింగరేణి ఎన్నికల్లో నిరంతరం కార్మిక హక్కులను కాపాడి, సమస్యలపై పోరాడే సంఘం చుక్క గుర్తుకు ఓటువేసి ఏఐటియుసి ని గెలిపించాలని కార్మికులను ఏఐటియుసి నాయకులు కోరారు. మంగళవారం మందమర్రి ఏరియా వర్క్ షాప్, స్టోర్‌లలో ఏఐటియుసి యూనియన్ అధ్వర్యంలో పిట్ కార్యదర్శి సిహెచ్పి శర్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ భీమనాధుని సుదర్శన్, జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 27తారీకున జరగు గుర్తింపు సంఘం ఎన్నికలలో ఏఐటియుసి గెలిపించాలని కార్మికులను కోరారు. సింగరేణిలో గతంలో గెలిచిన సర్కార్ సంఘం టీబీజీకేఎస్ గెలిచి కార్మిక హక్కులను యజమాన్యం వద్ద తాకట్టు పెట్టి సింగరేణి సంస్థను ఆర్థికంగా దివాలా తీశారని,ఈ సంఘం రానున్న రోజుల్లోకాలగర్భలో కలువ నుందనీ, ఈ సంఘానికి కార్మికులలో మనుగడ కోల్పోయిందని అన్నారు. పోరాడే ఎర్ర జెండా ఏఐటియుసి యూనియన్ ను విమర్శించడం అంటే ఉదయించే సూర్యునిపై ఉమ్మి వేయడమని అది ఎవరి మీదపడుద్దో అలోచించాలనీ హితవు పలికారు. వారసత్వ ఉద్యోగాలను జాతీయ సంఘాలు పోగొట్టాయని గ్లోబల్ ప్రచారం చేస్తున్నారని,అప్పుడున్నటువంటి ప్రభుత్వంలో సాజక్ లాంటి కొన్ని క్రాఫ్ట్ సంఘాలు సింగరేణిలో చీటికి మాటికి సమ్మెలు చేయడం వల్ల సింగరేణి సంస్థ నష్టాలలో కూరుకుపోయిన



సందర్భంలో ఐదు జాతీయ కార్మిక సంఘాలను పిలిచి చర్చలు జరిపిన సందర్భంలో సింగరేణి సంస్థను లాభాల దిశగాపెంపొందించాలని మారిటోరియం ఇవ్వడం జరిగినదనీ, అప్పుడు నెలకొన్న పరిస్థితుల్లో సింగరేణిలో డిపెండెంట్ వారసత్వ ఉద్యోగాలు ఇవ్వలేమని ప్రభుత్వం మొండి వాదన చేసి బిఎఫ్ఆర్ కోర్టుకు వెళ్లిందని, చర్చోప చర్చలు జరిగిన పిదప అట్టి ఒప్పందంలో ఎక్కడ కూడా వారసత్వ ఉద్యోగాలు పోగొట్టిన విధంగా రాయలేదని, భవిష్యత్తులో నూతన బొగ్గు గనులు ఏర్పడిన తరువాత వారసత్వ ఉద్యోగాలు కొనసాగించుకోవచ్చని అట్టి ఒప్పందంలో రాసుకోవడం జరిగినదని తెలిపారు. ఇంగీత జ్ఞానం లేని టీబీజీకేఎస్ సంఘం నాయకులు ఇలాంటి దుర్మార్గమైన ప్రచారం చేయడం పట్ల కార్మికులు గమనించాలని వీరి ప్రభుత్వంలో ఒక్క నూతన బొగ్గుగని కూడా తీసుకురాకపోగా కార్మికుల సంఖ్యను 70వేల నుండి 37 వేల కు కుదించి, కారుణ్య నియామకాల పేరుతో కార్మికుల వద్ద వేల కోట్ల రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. పది సంవత్సరాల గాఢ నిద్ర నుండి లేచి ఈ ఎన్నికలలో మేము ఒంటరిగా పోటీ చేస్తామని ప్రగల్భాలు పలుకుతూ ఐఎన్టియుసి సంఘం పోటీకి వస్తున్నారని, వీరు గతంలో గెలిచి కార్మిక హక్కులను తాకట్టు పెట్టిన వ్యక్తులనీ సింగరేణిలో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదనీ, సర్కారు సంఘాలు గెలవడం వల్ల కార్మికులకు నష్టం జరిగిన సంఘటనలు చూశామని అన్నారు. అనంతరం కార్మికుల సమక్షంలో ఏఐటియుసి ఎన్నికల మెనీఫేస్టో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్టోర్ పిట్ కార్యదర్శి కె ఓదేలు, బ్రాంచి నాయకులు పెద్దపెల్లి బాణయ్య, టేకుమట్ల తిరుపతి, పిట్టు సహాయ కార్యదర్శి రాజేశం, ఫిట్ ఉపాధ్యక్షులు మస్క భూమయ్య, మైన్ రక్షణ కమిటీ నాయకులు కన్నం వేణు, సిహెచ్ సదాశివరెడ్డి, బైరి పోశాలు, పొన్నం శ్రీనివాస్, హేమంత్ కుమార్, ఎండి వలి, రామకృష్ణ, తిరుపతి, సారయ్య, సురేష్,శ్రీనివాస్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం విక్రయించిన రైతులందరికీ కొనుగోలు పత్రాలు అందించాలి

## - జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

**అదిలాబాదు, బ్యూరో, డిసెంబర్ 12, సూర్య మేజర్ న్యూస్:** ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో వరిధాన్యం విక్రయించిన రైతులకు కొనుగోలు పత్రాలు అందించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కొత్తూర్ (డి.సి.ఎం.ఎస్), రెబ్బెనపల్లి, నెల్కివెంకటాపూర్ (డి.ఆర్.డి.ఎ.)లలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి ఎంపిక చేసిన గ్రామాలలో పంటకోత ప్రయోగాలు నిర్వహించడం జరుగుతుందని, ఎంపిక చేయబడిన భూములలో 5 మీటర్ల స్థలంలో కోత ద్వారా ప్రయోగం నిర్వహిస్తున్నామని తెలిపారు. పంట దిగుబడిని డిజిటల్ మిషన్ ద్వారా లెక్కించి ఆన్లైన్లో వివరాలు పొందుపర్చడంతో అన్ని జిల్లాల నుండి సేకరించిన సగటు దిగుబడిని రాష్ట్ర స్థాయిలో అంచనా వేయడానికి ఉపయోగపడుతుందని, భవిష్యత్ ప్రణాళికలు రూపొందించేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. నాణ్యమైన ధాన్యం కొనుగోలు 40 కిలోల 650 గ్రాముల బస్తా బరువు, దాదాపుగా 41 కిలోల వరకు మాత్రమే కాంట చేయాలని, ధాన్యం విక్రయించిన రైతులందరికీ కొనుగోలు పత్రాలు ఇవ్వాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్లో నమోదు చేసి రైతులకు 48 గంటలలో నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ రాజేందర్, మండల వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి అనిల్, మండల ప్రణాళిక అధికారి సుమన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

## 10 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యం పట్టివేత



**కాగజ్ నగర్, డిసెంబర్ 12, సూర్య మేజర్ న్యూస్:** బెజ్జూర్ మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ అధికారులు సీజ్ చేశారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కె సురేష్ కుమార్ గారి ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం టాస్క్ ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్, ఎస్ఐ సందీప్ కుమార్ల ఆధ్వర్యంలో తణిఖీలు చేపట్టారు. మండల కేంద్రానికి చెందిన యాద సంతోష్ అనే వ్యాపారి ఈ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్టు అధికారులకు సమాచారం అందడంతో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. 10 క్వింటాళ్ళ బియ్యం నిల్వలు అధికారులు తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకుని వ్యాపారిపై కేసులు నమోదు చేసి బెజ్జూర్ పోలీస్ స్టేషన్లో అప్పగించినట్టు సీఐ చెప్పారు. ఈ టాస్క్ లో పీసీలు మధు, రమేష్, సంజీవ్ పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు

### -తహసీల్దార్ రహిమొద్దిన్

**వాంకిడి,డిసెంబర్ 12,సూర్య మేజర్ న్యూస్:** మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ రహిమొద్దిన్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని



ప్రజాప్రతినిధులకు పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనవరి1 2024 ప్రామాణికంగా తీసుకుని అప్పటికే18 ఏళ్లు నిండిన వారికి ఓటరు జాబితాలో చోటు కల్పించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జనవరి 6. 2024 ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి.22 వరకు సదరు జాబితా పై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తామని చెప్పారు. ఫిబ్రవరి 2. 2024లోగా అభ్యంతరాలు. ఓటర్ క్లెయిమ్స్ ను పూర్తి స్థాయిలో పరిష్కరించి. అదే నెల 8. తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఇందుకోసం మండలంలోని ప్రజాప్రతినిధులందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముండే విమలబాయి. వైస్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్. బంబార సర్పంచ్ ఆయూబ్. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గుర్నులే నారాయణ తదితరులు ఉన్నారు.

## బెల్లంపల్లి ప్రజలకు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి డిసెంబర్ 12 సూర్య మేజర్ న్యూస్** బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజలు తనకు ఎన్నికల్లో అండగా నిలబడ్డారన్నారు. ప్రతి ఇంటికి సౌభాగ్యం తీసుకువచ్చే విధంగా పాలన అందజేస్తానని హామీ ఇచ్చారు. భావితరాలకు గుర్తుండే విధంగా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని మాట ఇచ్చారు. ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా తమకు సంప్రదించాలని బెల్లంపల్లి ప్రజానీకానికి సేవ చేసేందుకు నేను ఉన్నానని. మీకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్యను పరిష్కరిస్తూ పాలన సాగిస్తానని ఈ సభాముఖంగా మీ అందరికీ తెలియజేస్తున్నాను అని వారు అన్నారు

# శ్రీ ప్రసన్నాంజనేయ మహంకాళి దేవాలయంలో ఘనంగా చండి యాగం

**రామకృష్ణాపూర్, డిసెంబర్ 12, సూర్య మేజర్ న్యూస్** రామకృష్ణాపూర్లోని శ్రీ ప్రసన్నాంజనేయ మహంకాళి దేవాలయంలో చండి యాగం కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ చండియాగం శ్రీదేవి ఉపాసకులు బ్రహ్మశ్రీ ముస్త్యాల సంతోష్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు అవధూత శర్మ, వంశీ శర్మ, సురేష్ శర్మ తదితరుల సమక్షంలో జరిగింది. చండి హోమం కార్యక్రమంలో మొదటి గణపతి పూజతో ప్రారంభించి, అమ్మ వార్ల పూజ కార్యక్రమంతో ముగిసింది. తధానంతరం భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చండిహోమ నిర్వాహక కమిటీ సభ్యులు శ్రీపతి తిరుపతి, గోవిందుల రమేష్, నిమ్మల సాయి భక్తులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేను సన్మానించిన కురుమ సంఘ సభ్యులు

**ముధోల్ ,డిసెంబర్ 12, సూర్య మేజర్ న్యూస్** ముధోల్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన పవర్ రామారావు పటేల్ ను కురుమ సంఘ సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుమ కుల సంఘ భవనం కొరకు భైంసాలో స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. అంతేకాకుండా స్థానిక ఎన్నికలలో కురుమ సంఘ సభ్యులకు సర్పంచ్,ఎంపీటీసీ మరియు జెడ్పిటిసి స్థానాలకు పోటీ చేసేలా అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జట్ల నారాయణ మరియు తదితరులు పాల్గొన్నారు.



# కార్మికుల సమస్యల పరిష్కారానికి ముందుకు వస్తున్నా సిఐటీయునే గెలిపించండి

## -డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు గోపాల్

**రామకృష్ణాపూర్, డిసెంబర్ 12, సూర్య మేజర్ న్యూస్**

మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్, ఏరియా హాస్పిటల్ నందు రామగిరి రామస్వామి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశానికి హాజరైన డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు గోపాల్ మాట్లాడుతూ.. కనీసం ఏరియాలో గెలిచి పక్కనున్న నస్పూర్ మున్సిపాలిటీకి ఇంటికిరాయి ఇస్తున్నా క్యాతనపల్లి మున్సిపాలిటీకి హెచ్ఆర్ఏ ఇప్పించలేని టీబీజీకేఎస్ ఏఐటీయూసీ లను ఓడించాలని తెలిపారు. కార్మికులపై పని భారం పెరుగుతున్న మాట్లాడకుండా డిప్యూటేషన్లు పైరవీలతోనే ఈ 6సం.లు కాలం గడుపుతూ మళ్లీ ఓట్లు అడగడం విడ్డూరమని అన్నారు. చేతనైతే ఈ మందమర్రి ఏరియాలో ఏఐటియుసి ప్రాతినిధ్య సంఘంగా ఎన్ని స్ట్రక్చర్ సమావేశాలలో యాజమాన్య ప్రశ్నించారో ఇంటికిరాయి ఎందుకు ఇప్పించలేకపోయారో చెప్పి ఓట్లు అడగాలని ప్రశ్నించారు. నిన్నటి వరకు సింగరేణిలో రాజకీయ జోక్యం వలన నష్టపోతుందని చెప్తూ వచ్చిన ఐ ఎన్ టి సి నేడు కాంగ్రెస్ అనుబంధ నాయకులను యూనియన్ ఎన్నికలకు ఆహ్వానించడం అంటే ఏ విధంగా అర్థం చేసుకోవాలని మరోవైపు టీబీజీకేఎస్ నుండి ఐఎన్టీయూసికి వలసలు వస్తున్నారంటే రెండు యూనియన్లు ఒకటేనని మళ్లీ అదే నాయకులు కార్మికులను దోచుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సిఐటియుగా ప్రతి విషయం పైన కార్మికులకు అవగాహన కల్పించడమే లక్ష్యమని అలా సొంతింటి కల ఏ విధంగా నెరవేరుతో చెబుతూ పెర్క్స్ పై ఐటి మాఫీ అంటే ఏమిటో సైతం అవగాహన కల్పిస్తూ పోవడం వల్లనే నేడు సొంతింటి కల అలవెన్స్లపై ఐటి మాఫీ అంటూ అన్ని సంఘాలు ముందుకు వస్తున్న తీరును కార్మికులు అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికలలో గెలిచి కార్మిక సమస్యలపై మాట్లాడాలని సంఘాలను మళ్లీ ఎందుకు గెలిపించుకోవాలని దీర్ఘకాలిక సమస్యలపై పోరాడుతూ కార్మికులక సమస్యల పరిష్కారానికి దోహదం చేస్తున్న సిఐటీయును కార్మికులందరూ ఈసారి కోరుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా యువ కార్మికులు ఆలోచించాలని భాధ్యతగా కష్టపడి పనిచేసి సంస్థను కాపాడుకుంటూ హక్కులకై యాజమాన్యాన్ని ప్రశ్నించాలని కోరారు. ఓపెన్ కాస్టను వద్దని చెప్పిన ప్రభుత్వాలు ఓపెన్ కాస్ట్ లు తీసుకుంటూ వస్తున్నారని అందులోనూ ప్రైవేటు వారిని ప్రోత్సహిస్తూ కాంట్రాక్టు కార్మికులకు కనీసం జీతాలను సైతం ఇవ్వకపోతే పట్టించుకోవడంలేదని తెలిపారు. సిఐటియు చెప్తున్న పలు పోరాడిన,చెబుతున్న పలు అంశాలను కార్మికులు గుర్తుకు తెచ్చుకుంటున్నారని, అందుకే ఎవరు ఎన్ని చెప్పినా ఈసారి మనసులో ఉన్న సిఐటియుకు ఓటు వేయాలని నిర్ణయించుకున్నారని సిఐటియు ఉదయించే సూర్యుడు గెలుపుతో సింగరేణిలో ఒక కొత్త మార్పును కార్మికులందరూ గమనిస్తారని తెలిపారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో హాజరైన నాయకులు మాట్లాడుతూ పారామెడికల్ సిబ్బంది క్యాడర్ స్కీమ్ లో జరిగిన అన్యాయాన్ని సిఐటియుగా పోరాటం చేసి సరి చేశామని అంతేకాకుండా వార్డు అసిస్టెంట్ అను పరీక్షలు నిర్వహించి ఫలితాలు ఇవ్వకుండా



ప్రమోషన్లు ఆపిన విషయంపై ఆందోళన చేసి ఇప్పించామని తెలిపారు, ఏరియా ఆసుపత్రి తుంటే ఆందోళన చేసామని మహిళా సిబ్బందికి ఆస్పత్రులలో డ్రెస్సింగ్ రూమ్ కావాలని గతంలో ఉన్న క్రచ్చెను సైతం పునరుద్ధరించాలని ఆందోళనలు చేస్తున్నామని తెలిపారు. వార్డ్ అసిస్టెంట్ల క్యాడర్ స్కీమ్ తో పాటు ఇతర క్యాడర్ స్కీంలో లోపాలు ఉన్నాయి వాటిని స్ట్రక్చర్ సమావేశంలో మాట్లాడి సరి చేస్తామని తెలుపుతూ సొంతింటి కలపై పెర్క్స్ పై ఐటి మాఫీ పై మరింత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు ఎస్. వెంకటస్వామి కార్యదర్శి అల్లి రాజేందర్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు దూలం.శ్రీను, ఉపాధ్యక్షులు వడ్లకొండ.ఐలయ్య, ఆలవాల.సంజీవ్, వివిధ గనుల పిట్ సెక్రటరీలు భేతి.భరత్,చైతన్య రెడ్డి బంగారు.శ్రీనివాసు మరియు ఓసి కార్మికులు పాల్గొన్నారు.

## ముధోల్ గురుకుల ప్రిన్సిపాల్ పై సస్పెన్షన్ వేటు



**ముధోల్ ,డిసెంబర్ 12, సూర్య మేజర్ న్యూస్**

ముధోల్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.డి రఫీయోద్దీన్ ను మంగళవారం తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల సెక్రటరీ నవీన్ నికోలస్ సస్పెన్షన్ విధించారు. వివరాలు ఇలా ఉన్నాయి ప్రిన్సిపాల్ తమను అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు,మద్యం తాగి వస్తున్నారని ఇటీవలే పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల గేటు వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ గురుకుల సెక్రటరీ సదరు ప్రిన్సిపాల్ పై సస్పెన్షన్ విధించారు.

## సైబర్ నేరాలపై డిగ్రీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

**లోకేశ్వరం,డిసెంబర్ 12, సూర్య మేజర్ న్యూస్**

లోకేశ్వరం మండల కేంద్రంలోని వేదనిధి డిగ్రీ కళాశాలలో మంగళవారం బైంసా ఏఎస్పి సుభాష్ కాంతిలాల్ పటేల్ ఆదేశాల మేరకు విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని పోలీసులు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా లోకేశ్వరం ఏఎస్ఐ దిగంబర్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతేకాకుండా ఎవరైనా బ్యాంకు సిబ్బంది పేరిట బ్యాంకు లావాదేవీల గురించి ఓటీపీ అడిగినట్లయితే చెప్పవద్దని అన్నారు. అత్యవసర సమయంలో 100,102 నంబర్లకు ఫోన్ చేయాలని అన్నారు.



# కుంటాల తహసిల్దార్‌కు ఆటో డ్రైవర్ల వినతి

**కుంటాల,డిసెంబర్ 12, సూర్య మేజర్ న్యూస్**

ప్రభుత్వం మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించడంతో తాము ఉపాధిని కోల్పోయినట్లు ఆటో డ్రైవర్లు మంగళవారం కుంటాల మండల తహసీల్దార్ ఎజాజ్ కు వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినిత్యం ఆటో నడుపుతూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించే వారమని అన్నారు.ప్రభుత్వ నిర్ణయంతో తాము ఉపాధిని కోల్పోయి కష్టాల పాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు.అంతేకాకుండా ప్రభుత్వం తమను ఆదుకోవాలని మండల తాసిల్దార్ కు వినతి పత్రం అందించినట్లు వారు తెలిపారు.



## ఫౌండేషన్ వార్షికోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



**లోకేశ్వరం,డిసెంబర్ 12, సూర్య మేజర్ న్యూస్**

లోకేశ్వరం మండలం ధర్మోరా గ్రామానికి చెందిన మా-అమ్మానాన్న ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు మంగళవారం ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం ముధోల్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా-అమ్మ నాన్న ఫౌండేషన్ 13వ వార్షికోత్సవ కార్యక్రమానికి హాజరు కావలసిందిగా ఆయనను కోరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ముష్కం రామకృష్ణ గౌడ్, భైంసా పిఎసిఎస్ వైస్ చైర్మన్ చాకేటి లక్ష్మన్న, గౌతం పింగ్లే, భీమ్రావు డోంగ్రే మరియు తదితరులు పాల్గొన్నారు.

## 25 క్వింటాళ్ళ పిడిఎస్ బియ్యం పట్టివేత

**భైంసా డిసెంబర్ 12, సూర్య మేజర్ న్యూస్**

భైంసా మండలంలోని మాటేగాం గ్రామం వద్ద పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తూ ఉండగా బొలెరో వాహనంలో బైంసా నుండి మాటేగాం గ్రామంలోని రైస్ మిల్లుకు 25 క్వింటాళ్ళ పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు.ఈ సందర్భంగా ఎస్సై. శ్రీకాంత్ మాట్లాడుతూ అక్రమంగా ఎవరైనా రేషన్ బియ్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనంతరం వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.





# ముధోల్ ఎమ్మెల్యేకు నిర్మల్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆత్మీయ సన్మానం

**ముధోల్ ,డిసెంబర్12,సూర్య మేజర్ న్యూస్**

ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ కు నిర్మల్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు డాక్టర్ రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయములో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కొరకు ఆత్మ బలిదానము చేసుకున్న ముధోల్ నియోజకవర్గం అమరుల కుటుంబాలకు న్యాయము చేయాల్సిందిగా మరియు ఉద్యమకారులకు అన్ని ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యత, గౌరవము ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావించి 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరువాత కూడా ముధోల్ నియోజకవర్గ ఉద్యమ అమరవీరుల కుటుంబాలు ఎన్ని విజ్ఞప్తులు చేసిన కూడా గత ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం, ఉద్యోగం అందించలేదని,తెలంగాణ ఉద్యమ సమయంలో అమరులైన వారి యొక్క యఫ్. ఐ. ఆర్, పీ.ఎం.రిపోర్ట్,పేపర్ స్టేట్మెంట్స్ అన్ని భైంసా తహసీల్దార్ ద్వారా ప్రభుత్వానికి అందించి ఎన్ని సార్లు తిరిగినను ప్రకటించిన సహాయం లభించలేదని అన్నారు , ఈ విషయంలో కూడా ప్రతేక శ్రద్ధ తీసుకొని వారికి ఆదుకోవాల్సిందిగా విజ్ఞాపన పత్రం అందించి విజ్ఞప్తి చేసారు. ఈ



కార్యక్రమంలో అమరవీరుల కుటుంబ సభ్యులతో పాటు తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గం ఉద్యమకారులు చాకేటి లస్మన్న, తెలంగాణ తెలుగు కళా నిలయం అధ్యక్షులు పుండలిక్ రావు జాదవ్, భైంసా కౌన్సిలర్ గౌతమ్ పింగ్లే, భీంరావ్ దోన్గే, బాసర నాయకులు మనోహర్, విద్యార్థి ఉద్యమ నాయకులు సాయి సందీప్,ముధోల్ రాంరెడ్డి, రాజలింగు, రఘువీర్, లోకేశ్వరం కరుణసాగర్,మున్నూరు కాపు మిత్ర మండలి పెండపు కాశినాథ్, కోర్వగల్లి నాయకులు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

జన్నారం మండల కేంద్రంలో

# ఆటో డ్రైవర్ల ఆందోళన

**జన్నారం, డిసెంబర్12,సూర్య మేజర్ న్యూస్**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన మహాలక్ష్మి పథకాన్ని నిరసిస్తూ జన్నారం మండల వాహన(ఆటో,జీప్,టాటా ఏస్) యజమానులు,డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా డ్రైవర్ బాబా మాట్లాడుతూ మహిళల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్ ప్రయాణం వలన మేము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకం వలన మేము తీవ్రంగా నష్టపోతున్నామని,నెల నెలా కట్టే వాహన కిస్తీలను ఎలా చెల్లించగలము,కుటుంబ పోషణ ఎలా కొనసాగుతుందని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎవరికి ఎలాంటి



ఇబ్బందులు లేవని,కాంగ్రెసు ప్రభుత్వం ఏర్పడిన 10 రోజుల్లోనే మేము రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కావున మాకు ఏదైనా ఉపాధి కల్పించి మమ్మల్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నసీరొద్దీన్, బాబా,రమేష్ గౌడ్,అలీమ్,ప్రభుదాస్, మొగిలి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**ఆదిలాబాద్ సూర్య మేజర్ న్యూస్,**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తొలి రోజే ప్రగతి భవన్ కు "మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజా భవన్" గా పేరు మార్చడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అఖిల భారతీయ మాలీ మహా సంఘం నేతలు జైనథ్ మండల కేంద్రంలోని పులే చౌక్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మహాత్మ జ్యోతిబాపూలే దంపతుల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్ధించి పది సంవత్సరాలు పూర్తయిన ఇంతవరకు జ్యోతిరావు పూలే వారసులైన మాలీ కులస్తులకు ప్రగతి భవన్లో అడుగుపెట్టే అవకాశం లభించలేదని, అధికారంలోకి వచ్చి ప్రమాణస్వీకారం చేసిన తొలి రోజే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రగతి భవన్ పేరును మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజాభవన్ గా మార్చి ప్రజా వాని పేరిట ప్రతి మంగళ, శుక్రవారం సామాన్య ప్రజల నుంచి వచ్చే వినతుల్ని స్వీకరించి పరిష్కార మార్గాన్ని చూపే సాహసోపేతం నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమని అన్నారు. సామాజిక న్యాయం కోసం మాలీ కులస్తులు గత 22 సంవత్సరాలుగా అనేక పోరాటాలు చేసిన సందర్భంగా గత ముఖ్యమంత్రి కేసీఆర్,మాలిలకు ఎస్టీ హోదా కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదం కోసం కేంద్రానికి పంపించడం జరిగిందని సూచించారు. ఆట్టి బిల్లు ప్రస్తుతం కేంద్రం వద్ద పెండింగ్లో ఉందని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు,రైతులకు రుణమాఫీ, రైతుబంధు విషయంలో త్వరితగతిన నిర్ణయాలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి



మహిళల కోసం ఉచిత ప్రయాణం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టడం ఎంతో హర్షించదగ్గ విషయమని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే మాలీల ఎస్టీ హోదా పెండింగ్ బిల్లు కూడా వెంటనే ఆమోదముద్ర లభించేలా కృషిచేసి మాలిలకు ఎస్టీ హోదా కల్పించి అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న మాలికులస్తులకు సామాజిక న్యాయం అందించాలని కోరారు. అలాగే చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి జనవరి 3 న వర్ధంతిలను కూడా అధికారికంగా నిర్వహించాలని కోరారు. అదేవిధంగా జ్యోతిబాపూలే జయంతి, వర్ధంతి గత కాంగ్రెస్ ప్రభుత్వం 2008 నుండి అధికారికంగా నిర్వహించగా ఆ తర్వాత వచ్చిన తెరాస ప్రభుత్వం కేవలం జయంతిని మాత్రమే అధికారికంగా వహించి వర్ధంతిని వదిలేశారని దాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలీ మహా సంఘం జిల్లా అధ్యక్షులు విజయ్ వాడగురే,రాందాస్, శివకుమార్,సునీల్,సంతోష్,అరవింద్, వివిధ కుల సంఘాల నేతలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు వాయిదా

**ఆదిలాబాద్ సూర్య మేజర్ న్యూస్,**

జిల్లా కేంద్రంలో ఈ నెల 14 న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు కొన్ని కారణాల వల్ల వాయిదా వేసినట్లు మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి మిల్క,మంగళవారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఇట్టి వేడుకలను తదుపరి తేదీ పత్రిక ముఖంగా తెలుపుతామని సూచించారు. జిల్లాలోని అన్ని కేటగిరీల వికలాంగ అసోసియేషన్ సభ్యులు నాయకులు,వికలాంగ స్వయం సహాయక గ్రూపు సభ్యులు, వికలాంగ గ్రూపు సభ్యులు స్వచ్ఛంధ సంస్థలు గమనించాలని కోరారు.

# సీఆర్టీల సమస్యలను పరిష్కరించాలి

**ఆదిలాబాద్ సూర్య మేజర్ న్యూస్.**

ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో గత 20 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న సీఆర్టీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్ లోని ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని మంత్రి కొండ సురేఖను కలుసుకొని వినతిపత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. సీఆర్టీ ల ప్రధాన సమస్య ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. అదేవిధంగా టైం స్కెల్,దశల వారిగా క్రమబద్ధీకరణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ వర్కింగ్ అధ్యక్షుడు, జాదవ్ వినిత్ రావు,ప్రధాన కార్యదర్శి గోడం శ్రీనివాస్,పెద్ద శ్రీనివాస్,ధర్మసోత్ గోపాల్, ముంగిలాల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# జాతీయస్థాయి నెట్ బాల్ పోటీలకు ఆదర్శ్ విద్యార్థులు ఎంపిక

**ఆసిఫాబాద్ ప్రతినిధి12 నవంబర్ సూర్య మేజర్ న్యూస్**

జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల మరియు కళాశాల చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. తెలంగాణ నెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పదవ తరగతి విద్యార్థి మేకర్తి వంశీ వర్ధన్, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి జంజిరాల అజయ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 15 నుండి 17వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో జరగనున్న నెట్ బాల్ ఫెడరేషన్ కప్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా విద్యార్థులను నెట్ బాల్ జిల్లా అధ్యక్షులు అలిబిన్ అహ్మద్,పిడీ బి.తిరుపతి,ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులను సన్మానించారు. అలిబిన్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, జిల్లాలో నెట్ బాల్ క్రీడ అభివృద్ధికి కావలసిన సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించి పాఠశాలతో పాటు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు, యాజమాన్య కమిటీ చైర్మన్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.



సూర్య

బుధవారం, 13 డిసెంబర్ 2023

# కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ఆదిలాబాద్ సూర్య మేజర్ న్యూస్,**

సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ లో దాదాపుగా 25 సంవత్సరాల నుండి పనిచేస్తున్న కార్మికుల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని ఏఐటియుసి,రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ డిమాండ్ చేశారు. (సి డబ్ల్యూ సి) సెంట్రల్ వేర్ హౌసింగ్ 52 మంది కార్పొరేషన్ హమాలీలు ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్,తో కలిసి కార్మికులకు ఏఐటియుసి కండువలు కప్పి సాధనంగా సంఘంలోకి ఆహ్వానించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని భుక్తపూర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ. సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ లో కార్మికులు దాదాపుగా 25 సంవత్సరాల నుండి పనిచేస్తున్న ఈ రోజువరకు కార్మికులకు గుర్తింపు కార్డు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. దాంతో పాటు ఉద్యోగ భద్రత,పీఎఫ్, ఈఎస్ఐ, చెల్లించలేదని సూచించారు. నేరుగా కార్మికుల అకౌంట్లో చేసిన కష్టం డబ్బులు వేయకపోవడం శోచనీయమన్నారు.స్వాసంత్రం వచ్చి 77 సంవత్సరాల అవుతున్న కార్మికులకు ఇదేం పరిస్థితన్నారు దీనికి కారణం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలేనని మండిపడ్డారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వం పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు పైన తెలిపిన సమస్యలు వెంటనే పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐటియుసి, ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఏఐటియుసి, జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ కార్మికులు ఏఐటియుసి లో చేరడం స్వాగతిస్తూ రానున్న రోజుల్లో కార్మికుల సమస్యలపై ఏఐటియుసి ,ఆదిలాబాద్ జిల్లా సమితి చొరవ తీసుకుని ఉద్యమాలు చేపడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంటాల రాములు రాష్ట్ర సహాయ కార్యదర్శి చిల్క దేవిదాస్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మెస్రం భాస్కర్,రామడుగు జాషువా,జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గెడం కేశవ,మాడవి గణేష్,తదితరులు పాల్గొన్నారు.







## ఎమ్మెల్యే ప్రేమసాగర్ రావు ను సన్మానించిన డీజేఎఫ్ యూనియన్ నాయకులు

**రామకృష్ణాపూర్, డిసెంబర్ 12, సూర్య మేజర్ న్యూస్**

డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు కోల శ్రీనివాస్, వేణుగోపాల్ రెడ్డిలు హాజరయ్యారు. అనంతరం పాత కార్యవర్గ సభ్యులలో కొంత మంది అనివార్య కారణాలవల్ల యూనియన్ కు తమ పూర్తి స్థాయిలో పని చేయలేకపోతున్నారని గ్రహించిన జిల్లా కమిటీ వారు నిర్వహించిన పదవులను నూతనంగా ఉత్సాహంగా ఉండి యూనియన్ కొరకు పాటుపడే వారికి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. దీనిలో భాగంగా కార్యదర్శిగా ఉన్నటువంటి మాదాసు శ్రీకాంత్ యాదవ్ ను వర్కింగ్ ప్రెసిడెంట్ గా, కార్యదర్శిగా ఉన్నటువంటి గోర్కటి సురేష్ ను ప్రధాన కార్యదర్శిగా, పసునుటి ఆంజనేయులు ఉప అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడిన డి జె ఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తూ, సభ్యత్వాలను పెంచడం, తమ వంతుగా లో కీలక పాత్ర పోషిస్తామని అన్నారు. ఈ ఎన్నిక తదనంతరం నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు డీజే జిల్లా కమిటీ, రాష్ట్ర నాయకులు కలిసి పుష్పగుచ్ఛం, అందజేసి శాలువాతో సన్మానించారు. ఆక్రిడేషన్ తో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్ట్ అందరికీ గృహాలు ఇచ్చేల కృషి చేయాల్సిందిగా కోరారు. వారు సానుకూలంగా స్పందించి ప్రభుత్వంతో మాట్లాడతానని నా వంతు సహాయ సహకారాలు జర్నలిస్టులందరికీ ఎల్లవేళలా అందజేస్తానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం లో కుమార్, సతీష్, వెంకట్,సురేష్, పిట్టల ఈశ్వర్, వేల్పుల నరేష్, లు పాల్గొన్నారు.



పిఎస్ఆర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం సంపూర్ణం

**మంచిర్యాల, డిసెంబర్ 12, సూర్య మేజర్ న్యూస్ :**

పవిత్రమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మంచిర్యాల వాసవిక్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీక మాసం ప్రారంభం రోజు నుండి కార్తీక మాసం చివరి రోజు మంగళవారం వరకు నెల రోజుల పాటు అన్న అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ నాయకులు మాట్లాడుతూ మంచిర్యాల వాసవిక్లబ్ 2023 సంవత్సరంలో అనేక రకాల సేవా కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేసామని, ప్రతి నెల పౌర్ణమి, అమావాస్యలలో అన్నదాన కార్యక్రమాలతో పాటు కార్తీక మాసంలో నెల రోజుల పాటు నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు వివరించారు. ఈ సంవత్సరం నూతన కార్యవర్గం ద్వారా దాతల సహకారంతో అన్నదానాలతో పాటు వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవం, అమ్మవారి జయంతి వేడుకలు, గోదావరినది తీరంలోని గౌతమేశ్వర ఆలయంలో ఉచిత సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను వైభవంగా నిర్వహించడంతో పాటు శిథిలావస్థకు చేరిన గౌతమేశ్వర ఆలయం దాతల సహకారంతో మరమ్మత్తు పనులను నిర్వహించి, పునర్నించే పనులను వేగవంతంగా జరుపుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వాసవిక్లబ్ అధ్యక్షుడు నలుమాను ప్రవీణ్, కార్యదర్శి యెర్రం వెంకటేష్, కోశాధికారి చిలువేరు మహేష్, జోన్ చైర్మన్ కేశెట్టి వంశీకృష్ణ, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం చైర్మన్ పుల్లూరి బాలమోహన్, వికెఎస్పి ఇంచార్జి వుత్తూరి రమేష్, నాయకులు తోట రాజయ్య, చందూరి ప్రభాకర్, చిటుమల్ల శ్రీనివాస్, కాసం కృష్ణ, చకినారపు రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న దృశ్యం

## గౌరవ సత్కారం కోసం క్రైస్తవ అభ్యర్థుల నుంచి ఆహ్వానం

**ఆదిలాబాద్ సూర్య మేజర్ న్యూస్,**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలు 2023 కార్యక్రమాలలో భాగంగా ఎంపిక చేయబడిన అర్హులైన క్రైస్తవ అభ్యర్థులను,సంస్థలను గౌరవించి సత్కరించుటకు నిర్ణయించింది. అందు కొరకు అర్హులైన క్రైస్తవ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదిలాబాద్ జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖాధికారి రాథోడ్ రమేష్, మంగళవారం పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు, సామాజిక సేవా రంగం,విశిష్టమైన వైద్య సేవలు,విద్యా బోధన,సాహిత్యం,కళలు,క్రీడా రంగాలలో 10 సం.ల పైబడి విశేషమైన సేవలు అందించిన క్రైస్తవులు,వైద్య,విద్య, సామాజిక సేవారంగాలలో 30 సం.రాల పైబడి సేవ చేస్తూ ఉన్నటువంటి క్రైస్తవ సంస్థలు గౌరవ సత్కారం అందుకొనుటకు అర్హులన్నారు. ధరఖాస్తు చేసుకునే అభ్యర్థులు,సంస్థలు తమ నామినేషన్లను నిర్ణీత నమూనాలో పంపుటకు గాను జిల్లా అల్పసంఖ్యాక సంక్షేమాధికారి, ఆదిలాబాద్ బుధవారం నుండి తేదీ 15 లోగా తమ ధరఖాస్తులు అందజేయాలని. కోరారు.నామినేషన్ ఫారములు www.tscmfc.in అంతర్జాలము నందు గాని లేదా జిల్లా అల్ప సంఖ్యాక సంక్షేమాధికారి కార్యాలయములో సంప్రదించగలరు. ఫోన్ నెం. 091-8732356087 8121671292

## జార్ఖండ్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ ధీరజ్ సాహూ కు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం

**రామకృష్ణాపూర్, డిసెంబర్ 12, సూర్య మేజర్ న్యూస్**

భారతీయ జనతా పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మాస్ సత్యనారాయణ ఆధ్వర్యంలో రామకృష్ణాపూర్ పట్టణంలోని సూపర్ బజార్ ఏరియాలో కాంగ్రెస్ పార్టీ అవినీతి మరొక్కసారి బయటపడింది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు, బిజెపి రాష్ట్ర కార్యాలయ సభ్యులు పోశం మాట్లాడుతూ జార్ఖండ్ రాష్ట్రంలోని ఎంపీ ధీరజ్ సాహూ తన ఆఫీసులో దాదాపు 500 కోట్ల రూపాయలు ఐటీ శాఖ సోదాలు చేసి పట్టుకోవడం జరిగింది, దేశంలో మొట్టమొదటిసారి ఇంత పెద్ద సొమ్ము దొరకడం అందరిని ఆశ్చర్యానికి గురి చేయడం జరిగింది అని అన్నారు, మొన్న జరిగిన తెలంగాణ ఎలక్షన్లో కాంగ్రెస్ విచ్చలవిడిగా సొమ్మును పంచి అధికారంలోకి రావడం జరిగింది అని ఆరోపించారు, ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చింది, ఈ ఆరు గ్యారెంటీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వము ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టే అంతవరకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని వారు అన్నారు, ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఠాగూర్ దన సింగ్ . బిజెపి బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ముద్దసాని శ్రీనివాస్. బీజేవైఎం పట్టణ అధ్యక్షులు సంతోష్ రామ్. బీజేవైఎం ప్రధాన కార్యదర్శి ఓరుగంటి సాయి. బిజెపి పట్టణ నాయకులు వైద్య శ్రీనివాస్. ఉరుసు నరసయ్య. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.